www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 4 నవంబర్ 2025
5
తిరుపతి



20,21 తేదీల్లో తిరుపతికి రాష్ట్రపతి ముర్ము



ప్రజాశక్తి -తిరుపతి సిటీ

తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా భద్రతా ఏర్పాట్లు, ఈనెల 20, 21 తేదీల్లో తిరుచానూరు, శ్రీవారి ఆలయాల దర్శనానికి విచ్చేయనున్న భారత రాష్ట్రపతి భద్రతా చర్యలపై జిల్లా పోలీస్ కమాండ్ కంట్రోల్ కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ 'బ్రహ్మోత్సవాల సమయంలో భక్తుల రద్దీ అధికంగా ఉండే అవకాశం ఉన్నందున, ప్రతి విభాగం సమన్వయంతో క్షుణ్ణమైన ప్రణాళికతో పనిచేయాలి. భక్తుల సౌకర్యం, భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలి," అని సూచించారు. అలాగే రాష్ట్రపతి దర్శన పర్యటన సందర్భంగా అన్ని భద్రతా విభాగాలు పరస్పర సమన్వయంతో, అత్యధిక అప్రమత్తతతో వ్యవహరించాలని, ఏ చిన్న లోపం జరగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీలు రవిమనోహరచారి, రామకృష్ణ, నాగభూషణరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.



దళిత గిరిజనులకు 4 ఎకరాల చొప్పున ఇవ్వాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు డిమాండ్



దళిత గిరిజనులకు పట్టాలివ్వాలి

- 1440 ఎకరాల భూమి పేదల స్వాధీనం
- కలపాడులో వ్యకాసం 'భూపోరాట బాట'

ప్రజాశక్తి - వెంకటగిరి టౌన్

జానెడు భూమి కోసం ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నారు.. పెత్తందారుల వేధింపులు భరించారు.. తహశీల్దార్‌కు, ఆర్డీవోకు, కలెక్టర్‌కు భూముల్లేవని వినతులు సమర్పించారు.. పాలకులు, అధికారుల నిర్లక్ష్యంతో విసిగి వేసారిన పేద దళిత గిరిజనులు వ్యవసాయ కార్మిక సంఘం అండతో ఎర్రజెండా చేబూని సర్వే నంబర్ 1లోని 1440 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకున్నారు.. దళిత గిరిజనులకు నాలుగు ఎకరాలు పంచిపెట్టి, పట్టాలివ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. కలపాడులో చేపట్టిన 'భూపోరాట బాట'లో వందలాదిమంది నిరుపేదలు పాల్గొన్నారు.

సోమవారం ఉదయం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బాలకృష్ణ, దాసరి జనార్ధన్, ప్రాంతీయ కమిటీ కార్యదర్శి వడ్డిపల్లి చెంగయ్య నేతృత్వంలో కలపాడులోని సర్వే నంబర్ 1లోని 1440 ఎకరాల్లోని చెట్లు కొట్టి చదును చేపి భూమిని స్వాధీనం చేసుకున్నారు. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఈ గ్రామంలో వేలాది ఎకరాల ప్రభుత్వ భూములు ఉంటే దళిత గిరిజనులకు పంచడానికి మనసొప్పదా? అని ప్రశ్నించారు. అనేకమార్లు భూముల్లోకి వచ్చి సాగు చేసుకోడానికి వచ్చిన పేదలను భయభ్రాంతులకు గురిచేసి పోలీసు స్టేషన్లకు, కోర్టులకు పంపడం ఏంటని ప్రశ్నించారు. పేదల సంక్షేమమే ధ్యేయమని చెప్పుకునే పాలకులు చిత్తశుద్ధి ఉంటే కలపాడులోనే 1440 ఎకరాల ప్రభుత్వ భూమిని పేదలకు పంచాలని డిమాండ్ చేశారు. పేదలు భూముల్లోకి వస్తే అడ్డుకునే అధికారులు, ఆ భూముల్లో మట్టి అమ్ముకుని సొమ్ము చేసుకునేవారిపై అంత ప్రేమ ఎందుకని ప్రశ్నించారు.ఈ కార్యక్రమంలో బాలసుబ్రమణ్యం, చెంచుకృష్ణయ్య, దారా కృష్ణయ్య, తలారి వెంగయ్య, చెంచురామయ్య, మాధురి, గాలి శిరీష, కలపాటి మల్లేశ్వరి, దళిత గిరిజనులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



శెట్టిపల్లి భూముల్లో జంగిల్ క్లియరెన్స్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు శెట్టిపల్లి భూములకు శాశ్వత పరిష్కారం చూపాలని ఆదేశించిన నేపథ్యంలో తుడా ఛైర్మన్ డాలర్స్ దివాకర్‌రెడ్డి జంగిల్ క్లియరెన్స్, సరిహద్దు గుర్తింపు పనులకు సోమవారం శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా పూజా కార్యక్రమాలు నిర్వహించి, కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు. భవిష్యత్‌లో అభివృద్ధి చెందబోయే టౌన్‌షిప్ ప్రాజెక్టుకు ఇది తొలి అడుగ్గా నిలవనుంది. శెట్టిపల్లి భూముల సమస్య పరిష్కారంలో జంగిల్ క్లియరెన్స్, సరిహద్దు పనులు కీలక మైలురాయిగా నిలవనున్నాయి.

దివాకర్‌రెడ్డిని కలిసిన గంగమ్మగుడి ఛైర్మన్

తుడా ఛైర్మన్, తితిదే ఎక్స్ అఫిషియో మెంబర్ డాలర్స్ దివాకర్ రెడ్డిని తాతయ్యగుంట గంగమ్మ గుడి ఛైర్మన్ మహేష్ యాదవ్ (మక్కి యాదవ్) బోర్డు సభ్యులతో కలిసి మర్యాదపూర్వకంగా సోమవారం కలిసి దుశ్శాలువాతో సత్కరించారు. అలాగే తాతయ్యగుంట గంగమ్మ గుడిలో అభివద్ధి కార్యక్రమాలను, భవిష్యత్తు కార్యాచరణ గురించి వివరించారు.

మంత్రి 'మండిపల్లి' సైతం

తుడా ఛైర్మన్ డాలర్స్ దివాకర్‌రెడ్డిని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సోమవారం మర్యాదపూర్వకంగా కలిసారు. ఆయనతో పాటు పుంగనూరు టిడిపి సమన్వయకర్త చల్లా రామచంద్రారెడ్డి ఈ భేటీలో పాల్గొన్నారు. తుమ్మలగుంట నలందానగర్‌లోని దివాకర్‌రెడ్డి స్వగృహంలో అభివృద్ధి అంశాలు, రాజకీయ పరిణామాలపై చర్చించినట్లు సమాచారం.

పిల్లల ఈత సరదా మూడు కుటుంబాల్లో విషాదాన్ని నింపింది. జీవితకాలం ఆ తల్లులకు కడుపుకోత మిగిల్చింది. ఒక ఇంట్లో అయితే బిడ్డలే లేకుండా పోయారు.. కడుపుకోతను దిగమింగుకుంటూనే ప్రభుత్వ సాయం కోసం బాధిత కుటుంబాలు ఎదురుచూస్తున్నాయి. స్వర్ణముఖి నదిలో అక్రమంగా ఇసుక తవ్వడం వల్ల ఏర్పడిన గుంతలే తమ బిడ్డలను పొట్టన పెట్టుకున్నాయన్నది వారి ఆవేదన. ఓ రకంగా ఈ ఘటన గ్రామాన్నే విషాదంలో ముంచేసింది. స్వర్ణముఖిలో పడి నలుగురు పిల్లలు మృత్యువాత పడిన ఆ మూడు కుటుంబాల పరిస్థితి ఏంటని 'ప్రజాశక్తి' విచారించింది. పిల్లలను కోల్పోయిన ఆ కుటుంబాల బాధ వర్ణనాతీతమనే చెప్పవచ్చు. పిల్లల భవిష్యత్ కోసం ఇన్నాళ్లూ కష్టపడిన తల్లిదండ్రులకు ఇక భవిష్యత్తే అంధకారం అంటూ కుమిలిపోతున్నారు.



బిడ్డను కోల్పోయిన దేవి కుటుంబం



ఇద్దరు బిడ్డల్ని కోల్పోయిన మునస్వామిరెడ్డి దంపతులు



మునిచంద్ర మృతితో ఆ కుటుంబంలో విషాదం

భరోసా ఏదీ..?

కడుపుకోత మిగిల్చిన 'స్వర్ణముఖి'

గుంతలే బిడ్డల్ని మింగేశాయన్న వేదన

పాలకుల నిర్లక్ష్యంపై అగ్రహారం తల్లిదండ్రుల ఆగ్రహం

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

తిరుపతి రూరల్ మండలం వేదాంతపురం అగ్రహారానికి చెందిన మునస్వామిరెడ్డి కుమారులు తేజ, బాలు, మునస్వామిరెడ్డి తనయులు మునిచంద్ర, దేవికి చెందిన ప్రకాష్‌లు అక్టోబర్ 24న జరిగిన ఘటనలో మృత్యువాత పడ్డారు. మరో ముగ్గురు బయట పడ్డారు. అయితే 'హర్రర్' సినిమాలో శవాలను వెలికితీసినట్లు ఐదు గంటలకొక మృతదేహం, ఐదు గంటలకొక మృతదేహం బయట పడడంతో గ్రామంలో రెండు రోజుల పాటు ఉత్కంఠ నెలకొంది. పిల్లల తల్లులు స్పృహ కోల్పోతే, తండ్రులు దు:ఖం ఆపుకుంటూ దిగమింగుకున్నారు. రెండు రోజుల పాటు ప్రభుత్వం, పాలకులు హడావిడి చేశారు. తామున్నామంటూ భరోసా ఇచ్చారు. ఉన్నతాధికారులు సైతం ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలను రప్పించి వెలికితీత చేపట్టారు. చంద్రగిరి ఎంఎల్‌ఎ పులివర్తి నాని బాధిత కుటుంబాలను ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. అంతవరకూ బాగానే ఉంది. అయితే పిల్లల దహనసంస్కారాలు పూర్తయిన తరువాత ఏ హడావిడి లేదు. సాయమూ లేదు. పుట్టెడు దు:ఖంతో ఇళ్లల్లో తల్లిదండ్రులు ఏడ్చుకోవడం తప్ప ప్రభుత్వం నుంచి ఏ ఆర్థిక సాయమూ అందించలేదు. నెలకు 18వేల రూపాయలకు ఎడిఫై స్కూల్లో వ్యాను డ్రైవర్‌గా పనిచేస్తూ మునస్వామిరెడ్డి జీవనం సాగిస్తున్నాడు. అయితే ఇద్దరు కొడుకులూ మృతిచెందడంతో మానసికంగా కుంగిపోయాడు. ఎవరికోసం తాను పనిచేయాలన్న వైరాగ్యంలోకి వెళ్లిపోయాడు. భర్తను కోల్పోయిన దేవి పిండిమిషన్ వేస్తూ పిల్లల్ని కష్టపడి చదివించుకుంటోంది. చేతికి అందివచ్చిన కొడుకు నీళ్లపాలయ్యాడు. ఇప్పటికీ ఆ తల్లి మంచం వదల్లేదు. కూలినాలి చేసుకుని బతుకుతున్న మునికృష్ణారెడ్డి కుటుంబానిదీ అదే వేదన. పెద్దకొడుకు మునిచంద్ర స్వర్ణముఖికి బలయ్యాడు.

గుంతలే బిడ్డల్ని బలితీసుకున్నాయి : తల్లిదండ్రులు

నలుగురు బిడ్డలనూ స్వర్ణముఖిలో ఇసుకాసురుల అక్రమ గుంతలే మింగేశాయి.. ఇసుకను అక్రమంగా తవ్వేసి ఇసుకాసురులు కోట్లను గడించారు. అయితే ఆ గుంతలు మాత్రం మా వారసులను మింగేశాయి.. మా చిన్నప్పటి నుంచి మేమంతా స్వర్ణముఖిలో ఈత కొట్టేవాళ్లం. మా అమ్మానాన్న బట్టలు ఉతికేవారు. అప్పట్లో ఎటువంటి ప్రమాదం జరిగేది కాదు. స్వర్ణముఖి ఓ రకంగా మాకు ఆదరువుగా ఉండేది. అయితే ఇపుడు మా బిడ్డలను బలిగొన్న స్వర్ణముఖిని చూస్తుంటే భయమేస్తోంది.. ఇసుకాసురులు ఇసుకను లోడేస్తున్నా కలెక్టరేట్‌కు కూతవేటు దూరంలోనే మేము ఉన్నా అడ్డగించిన దిక్కులేదు. మా బాధ ఎవరికి చెప్పుకోవాలి. మా గోడు ఎవరు వింటారు?

దుస్తులు ఉతికి వినూత్న నిరసన

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తిరుపతి రూరల్ వేదాంతపురంలోని 214 సర్వే నెంబర్‌లోని 56 సెంట్లు విలువైన భూమిని ఆక్రమించి ఇల్లు నిర్మించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఏపీ రజక వత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో రాస్ ఆఫీస్ నుండి తిరుపతి రూరల్ ఎంఆర్‌ఓ కార్యాలయం వరకు నెత్తిన బట్టల మూటలు పెట్టుకొని నినదీస్తూ రూరల్ ఎంఆర్‌ఒ కార్యాలయం వరకూ ప్రదర్శన నిర్వహించారు. కార్యాలయం వద్ద వినూత్నంగా బట్టలు ఉతికి నిరసన తెలిపారు. దోబీఘాట్‌ను కాపాడాలని నినదించారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎస్.జయచంద్ర, రజక వృత్తిదారుల సంఘం జిల్లా అధ్యక్షులు మునిరత్నం మాట్లాడుతూ దోబీఘాట్‌ను ఆక్రమించుకుంటుంటే పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఏంటని ప్రశ్నించారు. అనేకమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్యను పరిష్కరించకపోవడం వల్లనే తమ బాధను వినూత్నంగా నిరసన తెలిపారన్నారు. రజకులకు సంబంధించిన ఈ భూమి సంబంధించి 2005లో కోర్టుకు వేశారని, 2013లో రజకులకు అనుకూలంగా తీర్పు వచ్చిందని, అనేకమార్లు ఆఫీసుల చుట్టూ చెప్పులు అరిగేలా తిరిగినా అధికారులు కనికరించడం లేదన్నారు. ఈ సందర్భంగా రూరల్ ఎంఆర్‌ఒ స్పందిస్తూ మంగళవారం ఉదయం సర్వే చేసి, ప్రభుత్వ భూమి అని తేలితే బోర్డు పెడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుమన్, చిన్నబాబు, మధు, సురేంద్ర, భాస్కర్, రమణ, రాజశేఖర్ పాల్గొన్నారు.





వినియోగదారులకు సమాధానం ఇస్తున్న సిఎండి శివశంకర్ లోతేటి

ఎస్పీడిసిఎల్‌లో నోడల్ ఆఫీసర్ల నియామకం

ప్రజాశక్తి - తిరుపతి సిటి

విద్యుత్ వినియోగదారుల సమస్యల సత్వర పరిష్కారానికి ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఎపిఎస్పిడిసిఎల్) వినూత్నంగా డయల్ యువర్ సిఎండి కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ప్రతి సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు తిరుపతి కార్పొరేట్ కార్యాలయంలో నిర్వహించే ఈ మొట్టమొదటి కార్యక్రమాన్ని సంస్థ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్ లోతేటి సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమం ద్వారా తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, కడప, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల నుంచి 87 మంది వినియోగదారులు తమ విద్యుత్ సమస్యలను సిఎండి దష్టికి తీసుకువచ్చారు. సమస్యలపై వారికి సిఎండి శివశంకర్ లోతేటి సమాధానమిస్తూ సంస్థ పరిధిలో వినియోగదారుల సమస్యలను స్వయంగా తెసుకుకోవాలనే ధ్యేయంతోనే కార్పొరేట్ కార్యాలయంలో మొట్టమొదటగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. సంస్థ పరిధిలోని తొమ్మిది జిల్లాల్లో ప్రతి జిల్లాకు ఒక చీఫ్ జనరల్ మేనేజర్/జనరల్ మేనేజర్ స్థాయి అధికారిని నోడల్ ఆఫీసర్‌గా నియమించామన్నారు. వినియోగదారుల సమస్యలను పరిష్కరించడంలో అధికారులు, సిబ్బంది అలసత్వం వహిస్తే సంబంధిత అధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమం ద్వారానే కాకుండా వినియోగదారులు విద్యుత్ శాఖ టోల్ ఫ్రీ నంబర్లు: 1912 లేదా 1800 425 155333కు కాల్ చేయడం లేదా వాట్సాప్ నంబరు: 91333 31912కు చాట్ చేయడం ద్వారా కూడా విద్యుత్ సమస్యలను అధికారుల దష్టికి తీసుకువచ్చి, పరిష్కరించుకోవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ పి. అయూబ్ ఖాన్, డైరెక్టర్ కె. గురవయ్య, డైరెక్టర్/ఫైనాన్స్ (ఎఫ్‌ఎసి) కె. రామమోహన్ రావు, చీఫ్ జనరల్ మేనేజర్లు పి.హెచ్. జానకిరామ్, జె. రమణా దేవి, కె. ఆదిశేషయ్య, యం. ఉమాపతి, యం. మురళీ కుమార్, జనరల్ మేనేజర్లు సి.హెచ్. రామచంద్రరావు, జి. చక్రపాణి, డి. సురేంద్ర రావు, పి. భాస్కర్ రెడ్డి, డి. జగదీష్, తిరుపతి సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ వి. చంద్ర శేఖర్ రావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డిస్పెన్సరీ ప్రారంభించిన మంత్రి

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

తిరుపతి అలిపిరి డిపోలో నూతనంగా ఏర్పాటు చేసిన ఏపీఎస్‌ఆర్టీసీ వైద్య డిస్పెన్సరిని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండపల్లి రాంప్రసాద్, ఏపీఎస్‌ఆర్టీసీ ఛైర్మన్ కె. నారాయణ రావు, ఎండి ద్వారకా తిరుమలరావు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 0.12 ఎకరాల విస్తరణలో 1.92 కోట్ల వ్యయంతో జి ప్లస్ త్రీ భవనాన్ని నూతనంగా నిర్మించామని, ఇందులో గ్రౌండ్ ఫ్లోర్లో పార్కింగ్, మొదటి అంతస్తులో డిస్పెన్సరీ, రెండవ మూడవ అంతస్తులో గెస్ట్ హౌస్ ఏర్పాటు చేసామన్నారు. వద్ధులు రోగుల సౌకర్యార్థం ఫార్మసీ, ల్యాబ్, ఓపిగది, వైద్యుల గది, లిఫ్ట్, విశాలమైన వెయిటింగ్ హాల్ సౌకర్యం కల్పించామన్నారు. ఈ డిస్పెన్సరీలో జిల్లాలోని 11 డిపోలు ఉద్యోగులు, విశ్రాంతి ఉద్యోగులు కలిపి 6వేల మంది ఉద్యోగులు లబ్ధి పొందుతారని, ప్రతిరోజు 100 మందికి వైద్య సేవలు, 30 రకాల వైద్య పరీక్షలు, నెలకు మూడు లక్షల మేరకు ఉచితంగా మందులు పంపిణీ జరుగుతుందని వెల్లడించారు. ఉద్యోగులకు నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం కషి చేస్తుందని, త్వరలో ఉద్యోగులకు ప్రమోషన్లు ఇస్తామని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, తుడ ఛైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి, ఆర్టీసీ జోనల్ ఛైర్మన్ నాగరాజు, సురేష్ రెడ్డి, చంద్రశేఖర్, రవివర్మ, టి. చంగల్రెడ్డి, వెంకటరమణ, విశ్వనాథ్, బాలాజీ, ఆర్టీసీ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



రెక్టార్ ఛాంబర్‌ను ముట్టడించిన విద్యార్థిసంఘాలు

ఎస్వీయూలో విద్యార్థినులపై వేధింపులు

రెక్టార్ ఛాంబర్‌లో విద్యార్థిసంఘాల నిరసన

చర్యలు తీసుకుంటామన్న హామీతో విరమణ

ప్రజాశక్తి - క్యాంపస్

శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం సైకాలజీ విభాగానికి చెందిన ప్రొఫెసర్ విశ్వనాథ రెడ్డి విద్యార్థినులపై వేధింపులకు పాల్పడుతున్నారని, సీనియర్ విద్యార్థుల చేత ర్యాగింగ్ చేయిస్తున్నారని నలుగురు విద్యార్థినులు విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ భూపతి నాయుడుకు ఫిర్యాదు చేశారు. ఈ విషయాన్ని గుట్టుచప్పుడు కాకుండా పరిష్కరించేందుకు లేడీస్ హాస్టల్ వార్డెన్లను పిలిపించి రెక్టార్ అప్పారావు రాజీ చేయాలని చూసినట్లు సమాచారం. విషయం తెలిసిన విద్యార్థి సంఘాలు ఎస్ఎఫ్ఐ, ఎఐఎస్ఎఫ్, ఎన్ఎస్‌యుఐ, ఎన్ఎల్ఎస్ఎ, జిఎన్ఎస్, జెబిఎస్ఎఫ్ నాయకులు రిజిస్ట్రార్ కార్యాలయానికి చేరుకొని సోమవారం ఆందోళన ప్రారంభించాయి.రెక్టార్ ఛాంబర్‌లోకి దూసుకెళ్లాయి. రిజిస్ట్రార్, రెక్టార్ విద్యార్థిసంఘాల నాయకులతో సమావేశమై చర్చించారు. ఆదివారం ర్యాగింగ్‌కు పాల్పడిన సీనియర్ విద్యార్థులను సస్పెండ్ చేస్తూ తక్షణం చర్యలు తీసుకున్నారు. వీసీ ఢిల్లీలో ఉన్నందున రిజిస్ట్రార్ ఆయనతో ఫోన్‌లో మాట్లాడి ప్రొఫెసర్‌పై విచారణ కమిటీ వేసి కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ ఘటనపై విద్యార్థిసంఘాలు ఎస్పీకి ఫిర్యాదు చేశారు. బుధవారం కమిటీ వేసి ప్రొఫెసర్ విశ్వనాథరెడ్డిని సస్పెండ్ చేస్తామని హామీ ఇవ్వడంతో విద్యార్థిసంఘాలు ఆందోళన విరమించాయి. ఈ కార్యక్రమంలో నాయకులు రవి, అక్బర్, అశోక్, వినోద్, చలపతి, జెన్నె మల్లికార్జున, సుందర్‌రాజు, శివశంకర్‌నాయక్, షేక్స, తిరుమలేష్, కుమార్ పాల్గొన్నారు.

బోనుపల్లి విద్యార్థినికి అరుదైన గౌరవం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి



శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని తొట్టంబేడు మండలం బోనుపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థిని సామా మహిజకు అరుదైన గౌరవం దక్కింది. ఈనెల 26వ తేదీన భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని అమరావతి మాక్ అసెంబ్లీలో మహిజ శ్రీకాళహస్తి నియోజకవర్గం ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించనున్నారు. ఆ మేరకు సోమవారం శ్రీకాళహస్తి ఎంఆర్సి కార్యాలయంలో భారత రాజ్యాంగంపై నిర్వహించిన నియోజవర్గ స్థాయి వ్యాసరచన పోటీల్లో మహిజ విజేతగా నిలిచారు. ఈ సందర్భంగా ఆమె అమరావతి మాక్ అసెంబ్లీకి వెళ్లే గౌరవాన్ని దక్కించుకున్నారు. ప్రతిభ చూపిన మహిజను ఎంఈఓలు భువనేశ్వరి, బాలయ్య అభినందించారు.



హైకోర్టు ఆదేశాలు బేఖాతర్

కలెక్టరేట్‌లో పెట్రోల్ పోసుకుని బాధితుల నిరసన

సామూహిక మరణానికి అనుమతివ్వాలని వినతి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

'మా స్వాధీన అనుభవంలోని భూమిని ఎలాగైనా దక్కించుకోవాలని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నోటీసులు పంపి, వాస్తవ రికార్డులు పరిశీలించకుండా మమ్మల్ని మానసిక క్షోభకు గురిచేస్తోంది.. హైకోర్టు ఆదేశాలను సైతం అధికారులు బేఖాతర్ చేస్తున్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలోనే ఐదుసార్లు వినతిపత్రాలు సమర్పించారు. సమస్యను పట్టించుకోలేదు.. మా సమస్యను పరిష్కరించండి.. లేదంటే సామూహికంగా చావడానికైనా అనుమతివ్వండి' అంటూ ఓ కుటుంబం కలెక్టరేట్ ఎదుట సోమవారం పెట్రోల్ పోసుకుని తమ వేదనను మీడియాకు వినిపించింది.

సోమవారం జిల్లా కలెక్టరేట్ వద్ద పెట్రోల్ పోసుకొని ఆత్మహత్య ప్రయత్నం చేసిన తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలోని సంజయ్ గాంధీ కాలనీ 20-5-746-3/3 ఇంటిలో నివాసం ఉండే బండి వెంకటసుబ్బమ్మ, జయరామిరెడ్డి, లక్ష్మీదేవి ల ఆవేదనతో కూడిన మాటలు. 1986వ సంవత్సరం నుండి పన్నులు చెల్లిస్తున్నామని, 1992లో పట్టా మంజూరు చేశారని తెలిపారు. 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మేము రెవెన్యూ డిపార్ట్మెంట్ ద్వారా పొందిన అనుభవ పత్రంపై అనుమానాలు ఉన్నాయంటూ తిరుపతి నగరపాలక సంస్థ రెవెన్యూ విభాగం, ప్లానింగ్ విభాగం, విద్యుత్ శాఖ ఇలా కొన్ని విభాగాల నుండి నోటీసులు జారీ చేశారన్నారు. అయితే ఆ నోటీసులకు స్పందించిన తాము తమ వద్ద ఉన్న రికార్డులను తీసుకెళ్తే పరిశీలించడానికి సుముఖత చూపలేదు. గడిచిన 25 ఏళ్లుగా ఈ సమస్యతో పోరాడుతున్నామని, తమ స్వాధీన అనుభవంలో ఉన్న భూమిని కబ్జా చేయాలని ప్రయత్నాలు జరుగుతున్నాయని రాష్ట్ర ముఖ్యమంత్రికి, ఉప ముఖ్యమంత్రికి తెలియచేసిన వారి ఆదేశాలను బేఖాతరు చేస్తున్నారు. హైకోర్టు ఆదేశాలను గౌరవించకపోవడంతో సామూహిక మరణానికి పెట్రోల్ పోసుకొని ఆత్మహత్య ప్రయత్నం చేసామన్నారు. ఇప్పటికైనా అధికారులు తమను ఇబ్బంది పెడుతున్న గోపికష్ణ, అధికార పార్టీ నాయకుడు కంకణాల రజనీకాంత్ నాయుడు, ఏఎస్పి స్థాయి అధికారిపై కఠిన చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నామని మీడియాకు తెలిపారు. దీనిపై జిల్లా రెవెన్యూ అధికారి నరసింహులు వారి వద్దకు వచ్చి తప్పకుండా న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో బాధితులు వెనుదిరిగారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికకు మొత్తం 403 అర్జీలు సోమవారం అందాయి.

వైద్య విద్యార్థుల నిరసన.....

తిరుపతి జిల్లా కలెక్టరేట్ వద్ద మెడికల్ కళాశాల విద్యార్థులు వందల మంది నిరసన వ్యక్తం చేశారు. ఈనెల 1వ తేదీన విధులలో ఖాళీ సమయం దొరకడంతో వెస్ట్ పోలీస్ స్టేషన్ పరిధిలో వెళుతున్న సమయంలో పోలీసులు వైద్య విద్యార్థులు జయంత్, హరీష్ నడుపుతున్న ద్విచక్ర వాహనాన్ని ఆపి దురుసుగా ప్రవర్తించడమే కాక దాడి చేశారన్నారు. సంబంధిత పోలీసులపై జిల్లా కలెక్టర్ స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని వినతి పత్రాన్ని సమర్పించారు.

- తిరుపతి నగర పాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 33 వినతులు వచ్చాయని డిప్యూటీ కమిషనర్ అమరయ్య తెలిపారు. 24 మంది కార్యాలయానికి నేరుగా వచ్చి, 9 మంది ఫోన్ ద్వారా సమస్యలు తెలిపారు. ప్రశాంతి నగర్ చివర, గోవిందనగర్ వద్ద అక్రమంగా నిర్మాణాలు చేస్తున్నారు అడ్డుకోవాలని, వద్దాప్య పింఛన్ ఇప్పించాలని, తన భర్త మరణించాడని పి. ఎఫ్. నగదు ఇప్పించాలని, తిమ్మినాయుడు పాలెంలో రోడ్లు, డ్రైనేజి కాలువలు నిర్మించాలని, అమిగోస్ అపార్ట్మెంట్‌లో నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న నిర్మాణాలు అడ్డుకోవాలని, దేవేంద్ర థియేటర్ శివాలయం వద్ద రోడ్డుపై ఉన్న గుంత పూడ్చాలని, మునిసిపల్ పార్క్ పక్కన పార్క్ చేసిన వాహనాలు తొలగించాలని, గరుడ వారధి పై ప్రమాదాలు జరగకుండా చర్యలు తీయనుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ ఇంజనీర్లు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ ఉన్నారు.



కలెక్టరేట్ ఎదుట కుటుంబం పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం

గ్రీవెన్స్ డేకు 5 అర్జీలు

ప్రజాశక్తి-దొరవారిసత్రం: దొరవారిసత్రం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగిన గ్రీవెన్స్ డే కార్యక్రమానికి 5 అర్జీలు వచ్చినట్లు తహశీల్దార్ శైలకుమారి తెలిపారు. భూమి సర్వే కోసం 3, పాస్ బుక్ కోసం1, ఇతర కోసం 1 వచ్చినట్లు తెలిపారు.

ఎస్ఐ హరిప్రసాద్‌కు సన్మానం


ఎస్ఐని సన్మానిస్తున్న బొప్పన తిలక్

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: ఇటీవల బుచ్చినాయుడు కండ్రిగ మండల నూతన ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన హరిప్రసాద్ ను మాజీ సర్పంచ్, రాష్ట్ర దేవాంగ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్, రాష్ట్ర వైసీపీ చేనేత విభాగ ప్రధాన కార్యదర్శి బొప్పన తిలక్ బాబు ఆధ్వర్యంలో ప్రధాన కమిటీ అధ్యక్షులు శివ కుమార్ మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు.

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం


శిలాఫలకం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: సత్యవేడు నియోజకవర్గంలోని వివిధ మండలాల్లో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం సోమవారం సుడిగాలి పర్యటన చేశారు. నీర్పా కోట, కమ్మపల్లి హాలులో తాగునీటి ట్యాంకు ప్రారంభించారు. ఎన్టీఆర్ నగర్‌లో ఇటీవల మృతి చెందిన జనసేన నేత కృష్ణకు నివాళి అర్పించి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ పర్యటనలో ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలానికి 3 పంచాయతీ భవనాల నిర్మాణానికి రూ.32 లక్షలు మంజూరు చేయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీదేవి, ఎంపీడీవో వెంకటరత్నమ్మ, విద్యాశాఖ అధికారి రవీంద్రనాథ్, అగ్రికల్చర్ అధికారి షణ్ముగం, ఏపీఎం మునయ్య పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పుత్తూరు మున్సిపాలిటీకి చెందిన యస్.ఇస్మాయిల్ అనారోగ్యంతో బాధపడుతుండగా, ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా రూ. 4.50 లక్షలు మంజూరు చేయించి, నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పెద్ద మనసు చాటుకున్నారు. ఎమ్మెల్యేకు ముస్లిం మైనారిటీ మహిళలు, యువకులు ధన్యవాదములు తెలిపారు.

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జీవిత కాల సభ్యులు చల్లా మునికృష్ణయ్య వారి సౌజన్యముతో సోమవారం పుత్తూరు తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో, తిరుపతి వాసన్ ఐ కేర్ హాస్పిటల్ వారిచే ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 147మంది కంటి పరీక్షలు చేయించుకోగా, 27మందికి అధునాతన టెక్నాలజీతో కంటి ఆపరేషన్ తిరుపతిలో ఉచితంగా చేసేందుకు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ వెంకేట్రామ్, వార్డ్ ఇంచార్జ్ సెక్రటరీ కోనేటి రవిరాజు, వాసన్ ఐ కేర్ పిఆర్ఒ వెంకటేష్, డాక్టర్ కల్యాన, శ్రుతిలు పాల్గొన్నారు.

వినతులు స్వీకరణ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు డివిజన్ పరిధిలోని సమస్యలు వీలైనంత త్వరితగతిన పరిష్కరిస్తామని ఎస్‌పిస్ ఆర్డీవో భాను ప్రకాష్ రెడ్డి తెలిపారు. గూడూరు పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజలనుండి వినతులు స్వీకరించారు. త్వరితగతిన సమస్యలు పరిష్కరిస్తామన్నారు.

మహిళా జట్టు విజయం గర్వకారణం

ప్రజాశక్తి - రామచంద్రపురం: ప్రపంచ మహిళా క్రికెట్ క్రీడా పోటీలలో భారత మహిళా క్రికెట్ జట్టు విజయకేతనం ఎగురవేసి వరల్డ్ కప్‌ను కైవసం చేసుకోవడం భారతదేశ మహిళలోకానికి గర్వకారణమని ఎమ్మెల్యే పులివర్తి నాని సతీమణి, టిడిపి మహిళా నేత పులివర్తి సుధా రెడ్డి కొనియాడారు. సోమవారం ఆమె మీడియాతో ఆదివారం జరిగిన ప్రపంచ క్రికెట్ ఫైనల్ మ్యాచ్‌లో భారత్ మహిళా క్రికెట్ జట్టు ఉత్తమ ప్రతిభను కనబరచి ఘన విజయం సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేసి, అభినందనలు తెలియజేశారు. మహిళల ధైర్యం, క్రమశిక్షణ, సంకల్పం దేశానికి మార్గదర్శకమని పేర్కొన్నారు. దేశంలోని మహిళలు అన్ని రంగాలలో పురోభివృద్ధి సాధిస్తున్నారని ఆశాభావం వ్యక్తం చేశారు. క్రికెట్ వరల్డ్ కప్‌లో మహిళా క్రికెట్ జట్టు సాధించిన విజయం మహిళలందరిదని తెలిపారు.

మానసిక, శారీరక దృఢత్వానికి క్రీడలు



ప్రజాశక్తి - తిరుమల: టీఎస్ఎస్ పురంలోని శ్రీ చైతన్య పాఠశాలలో పాఠశాలల వ్యవస్థాపకులు డాక్టర్ బి.ఎస్.రావు జ్ఞాపకార్థం క్రీడా సంస్థాపనోత్సవాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు వివిధ క్రీడాంశాలలో పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభకు విశ్రాంత వాయుదళాధికారి, ప్రముఖ క్రికెట్ కోచ్ ఆర్.కె మురుగన్ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఆయన క్రీడాజ్యోతిని వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు ఆటల్లో కూడా రాణించాలని తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యానికి వ్యాయామం, క్రీడలు తోడ్పడుతున్నాయని తెలిపారు. విద్యార్థులకు శ్రీ చైతన్య పాఠశాల ఏజీఎం సురేష్ అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఆర్ఐ డాక్టర్ మోహన్ బాబు, డీన్ రాజశేఖర్ ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

పర్యావరణ హితం అందరి బాధ్యత



ప్రజాశక్తి - తిరుపతి టౌన్: పర్యావరణ హితానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఏపీఐఐసి సిఐ చంద్ర శేఖర్ పిలుపునిచ్చారు. గాజులమండ్యం, ఇండస్ట్రీయల్ ఎస్టేట్‌లో ఏపీఐఐసీ పార్టనర్షిప్ సమ్మిట్ డ్రైవ్-2025లో భాగంగా శనివారం పారిశ్రామిక వాడలో పచ్చదనం పెంపొందించే కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో జోనల్ మేనేజర్ భరత్ రెడ్డి, డిప్యూటీ జోనల్ మేనేజర్ రుద్ర రాజు, వి.వరణ్, నాగమల్లయ్యలు మొక్కలు నాటారు.

అనారోగ్య బాధితుడికి ఆర్థికసాయం

ప్రజాశక్తి - నాయుడుపేట: నాయుడుపేట పట్టణానికి చెందిన సారంగం మురళి కృష్ణ ఎన్నో ఏళ్లుగా ట్రాక్టర్ మెకానిక్‌గా పని చేస్తున్నాడు. గత కొంతకాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ క్రమంలో విషయం తెలుసుకున్న బలిజ సేవా ఫౌండేషన్ సభ్యులు ఆయనకు వైద్య ఖర్చుల నిమిత్తం పదివేల రూపాయలను ఆర్థిక సహాయం అందించి వారి దాతృత్వాన్ని చాటుకున్నారు. బలిజ సంఘం ప్రెసిడెంట్ పగడాల శివ ప్రదీప్ ఆధ్వర్యంలో బలిజ సంఘం సహాయ కార్యదర్శి హంస పృథ్వి చంద్ సహకారంతో ఈ సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో హంస రామారావు, నీలం హరి కృష్ణ, పసుపులేటి హరి పాల్గొన్నారు.

సుస్థిర జీవనోపాధుల కల్పనే లక్ష్యం

ప్రజాశక్తి - బుచ్చి నాయుడు కండ్రిగ: బుచ్చినాయుడు కండ్రిగ మండలం, వెలుగు కార్యాలయంలో సోమవారం జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అడిషనల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ప్రభావతి ముఖ్య అతిథిగా పాల్గొని, విఓఏలతో రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళా సంఘాల వారికి ఏ నెలలో ఏ అవసరానికి ఎంత కావాలనేది వార్షిక ఋణ ప్రణాళిక సభ్యుల వారీగా బయోమెట్రిక్ అథెంటికేషన్‌తో తయారు చేయడం జరిగింది. ఈ ప్రకారం బ్యాంకు లింకేజీ, ఉన్నతి, స్త్రీ నిధి, సిఐఎఫ్ రుణాలతో వారు ఎంపిక చేసిన జీవనోపాధులకు పెట్టుబడి పెట్టడం ద్వారా వారు జీవనోపాధి సుస్థిరం చేసుకోవాలని తెలిపారు. ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు కొనుగోలు చేసిన వారు పశుసంవర్ధశాఖ వారి సహకారంతో బీమా చేసుకోవాలని సూచించారు. ఏపియం మునెయ్య మాట్లాడుతూ సంఘాలు, సమావేశాలలు 100శాతం హాజరుతో జరపడమే కాక, పుస్తక నిర్వహణ సక్రమంగా ఉండాలని తెలియ జేశారు. స్త్రీ నిధి మేనేజర్ వనజ మాట్లాడుతూ స్త్రీ నిధి ప్రస్తుతం ఒక సంఘంలో రూ.8 లక్షలు వరకు ఇవ్వవచ్చని, ఈ ఆర్థిక సంవత్సరంలో టార్గెట్ రూ.8 కోట్లకు గాను రూ.5 కోట్ల 45లక్షలు రుణాలు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. మిగిలిన టార్గెట్ కూడా డిసెంబర్ లోపు పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో సీసీలు కే.వెంకటరత్నం, వీరజిన్న, జీవ మండల సమాఖ్య లీడర్లు, విఓఏలు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీకి ఎంపికైన మొగరాల విద్యార్థి


విద్యార్థి జ్యోష్నను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి - పాకాల: మొగరాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థి జోష్న రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీకి ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుమలత తెలిపారు. రాబోవు రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని "హిస్టరీ బిహైండ్ మేకింగ్ ఇండియన్ కాన్స్టిట్యూషన్" అనే అంశంపై నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన వ్యాసరచన పోటీలలో ప్రథమ స్థానం సాధించి, రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీకి ఎంపికైన సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు విద్యార్థినిని అభినందించారు.

హక్కులు లేక.. సంక్షేమ పథకాలు అందక..!


పేదల జీవనోపాధికి పంపిణీ చేసిన భూములు

ప్రజాశక్తి -బాలాయపల్లి: మండలంలో భూమి లేని పేదలకు జీవనోపాది కోసం గతంలో ప్రభుత్వం సిజెఎఫ్ఎస్ భూములను పంపిణీ చేసింది. అయితే ఈ భూముల్లో పంటలు సాగు చేసుకోవడం తప్ప సిజెఎఫ్ఎస్ పట్టాలు ద్వారా ఎలాంటి రుణాలు పొందలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో కొందరు సాగు చేసుకునేందుకు డబ్బులు లేక, సాగు భూములను బీడు భూములుగా వదిలేయగా, మరికొందరు అప్పులు చేసి పంటలు సాగుచేసుకుంటున్నారు. భూములన్నప్పటికీ.. పెట్టుబడి డబ్బులు లేక పంటలు సాగుకు రైతులు ఇబ్బందులు పడుతున్నారని గుర్తించిన గత ప్రభుత్వం సిజెఎఫ్ఎస్‌లు రద్దు చేసి అసైన్‌మెంట్ పట్టాలు మంజూరు చేసేందుకు శ్రీకారం చుట్టింది. ఈ క్రమంలో మండలంలోని సిజెఎఫ్ఎస్ సొసైటీలను రద్దు చేసింది. అయితే రద్దు అయిన సిజెఎఫ్ఎస్ భూములు రికార్డుల లో ఈ భూములు అడవిగా నమోదు అయి ఉండడంతో మండలంలోని అంబలపూడి, అరిగేపల్లి, చిలమనూరు, చుట్టి, గొల్లగుంట, జయంపు, నిడిగల్లు, పెరిమిడి, సుబ్రమణ్యం, ఊట్లపల్లి గ్రామాల లబ్దిదారులకు పట్టాలు మంజూరును నిలిపివేశారు. అదేసమయంలో ఎన్నికలు రావడంలో పట్టాలు మంజూరు ప్రక్రియ పూర్తిగా నిలిచి పోయింది. దీంతో ఎంతో కాలంగా సాగు చేసుకుంటున్న భూములకు హక్కులు కల్పిస్తారా లేదా అన్న సందేహం వారిని వెంటాడుతోంది. సాగుభూములకు హక్కులు లేక పోవడంతో, రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అందిస్తున్న సంక్షేమ పథకాలకు దూరమవుతున్నామని రేతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, తమ భూములు పూర్తి హక్కులతో ఇప్పించాలని కోరుతున్నారు.

ధర్మకర్తల మండలి ఆత్మీయ సమావేశం

ప్రజాశక్తి - నాగలాపురం: సత్యవేడు నియోజవర్గం, నాగలాపురం మండలం, సురుటుపల్లి, శ్రీపల్లికొండేశ్వర స్వామి ఆలయంలో సోమవారం ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ పద్మనాభ రాజు ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా విజయలక్ష్మి, చంద్రశేఖర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే హేమలత, డిసిసి బ్యాంకు చైర్మన్ అమాస రాజ శేఖర్ రెడ్డి, చందన స్రవంతి, అన్న అనిత, మాధవ నాయుడు, శ్రీనివాసులు నాయుడు, కన్నయ్య నాయుడు, సతీష్ నాయుడు, గిరిబాబు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కూరపాటి శంకర్ రెడ్డి మాట్లాడుతూ ఆలయం చుట్టూ సిమెంట్ రోడ్డు నిర్మించనున్న నేపథ్యంలో ఇళ్ల తొలగింపుకు సంబంధించి పరిహారంగా రూ.15 లక్షల రూపాయలను ఇస్తున్నట్టు ప్రకటించారు. సత్యవేడు జడ్పిటిసి విజయలక్ష్మి చంద్రశేఖర్ రెడ్డి, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ పద్మనాభరాజులు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న వివిధ ఆయల అభివృద్ధి పనులు వెంటనే చేపడతామన్నారు. ఈ సమావేశంలో ట్రస్ట్ బోర్డు సభ్యులు జయంతి, కృష్ణయ్య యాదవ్, దేవిధన శేఖర్, హేమంత్ కుమార్, హంస, కవిత శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దార్ కే. జే జే రావుకు సన్మానం



ప్రజాశక్తి -కోట : తుపాను నేపథ్యంలో అవిశ్రాంత కృషి చేసి కోట తహశీల్దారు కె.జే.జే రావు సీఎం చంద్రబాబు నాయుడు చేతుల మీదగా అవార్డు అందుకోవడం జరిగింది. ఈ సందర్భంగా సోమవారం కోట మండలంలోని తహశీల్దార్ కార్యాలయంలో ఆయనను పలువురు టిడిపి నాయకులు, జర్నలిస్టులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. అనంతరం టిడిపి నాయకులు బందెల రఘురామ్, పల్లెమల్లు వెంకటకృష్ణారెడ్డిలు జేజే రావుకు అవార్డు రావడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు పల్లెమల్లు వెంకట కృష్ణారెడ్డి, బందెల రఘురామ్, చల్లా కృష్ణ,షేక్ మస్తాన్ భాష, బూచి సుబ్రహ్మణ్యం, బైనమూడి పెంచల స్వామి, మండల సర్వేయర్ గోపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్వీయూ రెక్టార్‌ను కలిసిన తిప్పారెడ్డి

ప్రజాశక్తి - క్యాంపస్ : ఎస్వియు నూతన రెక్టార్‌గా బాధ్యతలు చేపట్టిన సీనియర్ ప్రొఫెసర్ సిహెచ్ అప్పారావును అంబేద్కర్ గ్లోబల్ లా ఇన్స్టిట్యూట్ చైర్మన్ డాక్టర్ తిప్పారెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా తిప్పారెడ్డి మాట్లాడుతూ అకాడమిక్ అచీవ్మెంట్ తో పాటు యూనివర్సిటీ పరిపాలనలో డిఓఏ డైరెక్టర్, డెవలప్మెంట్, సిడిసి డీన్, 15 నెలల పాటు ఇన్చార్జి వైస్ ఛాన్సలర్‌గా బాధ్యతలు నిర్వహించారన్నారు. ఆచార్య అప్పారావు రెక్టార్‌గా నియామకం ఆనందదాయకమన్నారు. భవిష్యత్తులో ఆయన ఉన్నత పదవులు అలంకరించే విధంగా ఆ దేవదేవుని ఆశీస్సులు ఆయనపై ఉండాలని కోరారు. రెక్టర్ ను కలిసిన వారిలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్. డాక్టర్ .బిజయ కుమార్ బెహరా, సెక్రటరీ ఆర్ లక్ష్మీప్రసన్న తదితరులు ఉన్నారు.

శ్రీసిటీలో యుఎన్ విజన్ దౌత్యవేత్త జయరాములు

ప్రజాశక్తి- వరదయ్యపాలెం : మాస్కోలోని ఇంటర్నేషనల్ సెంటర్ ఫర్ సైంటిఫిక్ అండ్ టెక్నికల్ ఇన్ఫర్మేషన్ నిపుణుడు, యుఎన్ విజన్ దౌత్యవేత్త జయ రాములు లింగుట్ల సోమవారం ఆంధ్ర ప్రదేశ్ పర్యటనలో భాగంగా శ్రీసిటీని సందర్శించారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఆయనకు సాదర స్వాగతం పలికి, శ్రీసిటీ ప్రగతి, ప్రత్యేకతల గురించి వివరించారు.

యూరియా పంపిణీ

ప్రజాశక్తి -వాకాడు: వాకాడు మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార కేంద్రంలో టిడిపి నాయకులు సోమవారం రైతులకు యూరియా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సహకార సంఘ చైర్మన్ ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ రైతులకు యూరియా కొరత లేకుండా ప్రభుత్వం ఆదుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారిణి దీప, టిడిపి మండల అధ్యక్షులు మధు రెడ్డి, టిడిపి నాయకులు సన్నారెడ్డి విజయ శేఖర్ రెడ్డి, రామలింగారెడ్డి, మాజీ జెడ్పిటిసి బత్తిన ప్రమీల, మాజీ సర్పంచ్ దువ్వూరు భార్గవ్ రామ్, నందగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ స్థలాలే మా టార్గెట్ : ఆర్డీవో

నేటి నుంచి రాజీవ్ నగర్ డ్రైవ్



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: పట్టణ శివారు ప్రాంతమైన రాజీవ్ నగర్ లో వివాదాస్పద ఇంటి స్థలాల పరిశీలన కార్యక్రమాన్ని ఈ నెల 4వ తేదీ నుంచి 18వ తేదీ వరకు నిర్వహించనున్నామని శ్రీకాళహస్తి ఆర్డిఓ భాను ప్రకాష్ రెడ్డి పేర్కొన్నారు. రాజీవ్ నగర్ డ్రైవ్ పై ప్రజలు ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దనీ.. పక్కా గృహాల జోలికి పోమనీ.. ఖాళీ స్థలాలు మాత్రమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సోమవారం రాజీవ్ నగర్ డ్రైవ్ పై తహశీల్దార్ జనార్ధన్ రావు తో కలిసి ఆర్డిఓ మీడియా సమావేశం నిర్వహించారు. రాజీవ్ నగర్ లో 2007 సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం మూడు దఫాలుగా సుమారు 6500 ఇంటి స్థలాలను పేదలకు కేటాయించిందన్నారు. ఈ స్థలాల్లో ఇప్పటివరకు 1800 ఖాళీలు ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. వాటిని గుర్తించడానికి 12 బ్లాకులుగా విభజించి, ఏడు బృందాలతో స్థలాలు, పట్టాల పరిశీలన జరుపుతామని తెలిపారు. లబ్ధిదారుల స్థలాలకు సంబంధించిన ఒరిజినల్ హక్కు పత్రాలను తీసుకువస్తే, పరిశీలించి తామొక ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తామని వివరించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని సచివాలయంలో లబ్ధిదారుల కోసం హెల్ప్ డెస్క్ ను ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. ఖాళీ స్థలాలకు సంబంధించి సరైన ఆధారాలు చూపకుంటే వాటిని రద్దుచేసి అర్హులైన పేదలకు పంచుతామని స్పష్టం చేశారు. కాగా రాజీవ్ నగర్ డ్రైవ్ ద్వారా అక్రమార్కుల అంతు తేలుస్తామని రాగాలు తీసిన రెవెన్యూ అధికారులు.. ఖాళీ జాగాలే మా టార్గెట్ అని చెప్పడంతో అక్రమార్కులంతా ఒక్కసారిగా ఊపిరి పీల్చుకున్నట్లు అయింది.

స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యం

ప్రజాశక్తి -దొరవారిసత్రం : స్థానిక సంస్థల ఎన్నికల్లో కుటమి అభ్యర్థులు ఘన విజయం సాధించే దిశగా కుటమి నాయకులు కృషి చేయాలని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ నాయకులకు సూచించారు. సోమవారం మండల పరిషత్ కార్యక్రమంలో పిఏసిఎస్ ఛైర్మెన్ ప్రమాణస్వీకారం, కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతు పార్టీకోసం కష్టపడ్డ ప్రతి ఒక్కరికి పదవులు వస్తాయని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో, కుటమి అభ్యర్థులు విజయం సాధించేందుకు నాయకులు, కార్యకర్తలు పని చేయాలని సూచించారు. అనంతరం పిఏసిఎస్ చేర్మెన్‌గా ముప్పాలా శ్రీహరి రెడ్డి, సభ్యులుగా సంచి విజయకుమార్, మల్లేపల్లి సుబ్రహ్మణ్యంలచే ప్రమాణస్వీకారం చేయించారు. ఈకార్యక్రమంలో నాయకులు ఆకుతోట రమేష్, సుధాకర్ రెడ్డి, శ్రీనివాసులు నాయుడు, ఉదయకుమార్, కృష్ణమూర్తి, రమణయ్య, తహశీల్దార్ శైల కుమారి, ఎంపీడీఓ గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

నీట మునిగిన పంట భూములు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : రూరల్ పరిధి, ఎస్‌బిఆర్ పురం పంచాయతీ, గూళూరు చెరువు వర్షాలతో నిండి, పొంగిపోయి పరిసర వ్యవసాయ భూములు సుమారు 490 ఎకరాల మేర నీట మునిగిపోయాయి. గత రెండు దశాబ్దాలుగా వేసిన పంటలు నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎస్‌బిఆర్ పురం గ్రామ సర్పంచ్ మణి రాజు, గ్రామ ప్రజలు సోమవారం ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్‌ను కలిసి సమస్యను పరిష్కరించి తమను ఆదుకోవాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మణిరాజు మాట్లాడుతూ గూళూరు చెరువులో నీరు నిలవడంతోపాటు, గ్రామంలోని డ్రైనేజ్ నీరు కలిసి, తాగు నీరు కాలుష్యమవుతోందన్నారు. దీంతో గ్రామస్తులు పలు రోగాల బారిన పడుతున్నారని తెలిపారు. ఇటీవల 180 మందికి పైగా మృతిచెందినట్లు వివరించారు. తూముల ద్వారా నీటిని బయటకు వదిలితే పంటలను, గ్రామస్తుల ప్రాణాలను కాపాడుకోవచ్చని తెలిపారు. ఈ విషయమై పలుమార్లు రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులకు అర్జీలు సమర్పించినప్పటికీ పట్టించుకోలేదని ఆరోపించారు. తమ వినతిపై స్పందించిన ఎమ్మెల్యే.. జిల్లా కలెక్టర్, ఆర్డీవోలతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

ప్రతి రైతుకు యూరియా అందించాలి



వ్యవసాయ కార్యాలయం వద్ద రైతుల ధర్నా

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ప్రతి రైతుకు యూరియా అందించాలని ఏపీ కౌలు రైతు సంఘం ప్రాంతీయ కార్యదర్శి జోగి శివ కుమార్ పేర్కొన్నారు. సోమవారం గూడూరు, మండల వ్యవసాయ కార్యాలయం వద్ద రైతులతో కలిసి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు యూరియా పొందేందుకు, గత పది రోజుల నుంచి గుర్తింపు కార్డు ఇవ్వాలని కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారని, రైతుల పట్ల వ్యవసాయ శాఖ ఏడి, ఏవోలు దురుసుగా వ్యవహరించారని ఆరోపించారు. బ్లాక్ మార్కెట్లో ఒక యూరియా బస్తా ఎనిమిది వందల రూపాయలు అమ్ముతున్నారని, అధికారులు అటవైపు కన్నెత్తి చూడటం లేదని వాపోయారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అనాలోచిత నిర్ణయాలతో రైతులు ఇబ్బందిపడుతున్నారని తెలిపారు. ప్రతి రైతుకు యూరియా అందించాలని, లేనిపక్షంలో రైతులతో కలిసి ధర్నా చేపడతామని హెచ్చరించారు. ఈయన వెంట రైతులు నాగరాజు, వెంకట సుబ్బయ్య, రఘు, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్‌కు సన్మానం


గంజి మాధవయ్యను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : అమెరికా పర్యటన విజయవం తంగా ముగిసి భారత దేశానికి విచ్చేసిన పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ గంజి మాధవయ్యను గొల్లపల్లి పంచాయితీ టిడిపి నాయకులు సోమవారం కలిసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మాజీ ఎంపీటీసీ గజపతి, తడుకు సింగల్ విండో అధ్యక్షుడు కరుణ యాదవ్, జగ్గయ్య , చిన్నప్ప, భాస్కర్, వెంకటరత్నం, నాయకులు పాల్గొన్నారు.

నెల వ్యవధిలో రాజమండ్రికి 13 విమాన సర్వీసులు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో : నెల వ్యవధిలో రాజమహేంద్రవరం నుంచి తిరుపతికి 13 సర్వీసులు నడిపితే మొత్తం 548 మంది, మరో 11 మంది పిల్లలు ప్రయాణించారు. తిరుపతి నుంచి రాజమహేంద్రవరానికి నడిచిన 13 విమాన సర్వీసుల ద్వారా 415 మంది ప్రయాణం చేశారు. ఈ నెల వ్యవధిలో మొత్తం 963మంది ప్రయాణించారు. అలయన్స్ ఎయిర్ విమానయాన సంస్థ వారంలో మూడు రోజులు (మంగళ, గురు, శనివారం) విమాన సర్వీసుల్ని నడుపుతోంది. ఈ విమాన సర్వీసుకు ప్రయాణికులను ఆకట్టుకునేందుకు టికెట్ ధరలపై కూడా ఆఫర్ ప్రకటించారు.. ముందు రూ.1,499, అనంతరం మూడు నెలల పాటూ 50శాతం టిక్కెట్లు రూ.1,999లకే టికెట్లు అందిస్తున్నారు. మిగిలిన టిక్కెట్ల ధరను రూ. రూ.4వేలుగా నిర్ణయించారు. రాజమహేంద్రవరం నుంచి బయలుదేరి తిరుపతి వెళ్లిన విమానం.. అక్కడి నుంచి కేవలం 25 నిమిషాల వ్యవధిలో మళ్లీ హైదరాబాద్‌కు వెళుతుంది. ఆసక్తికరంగా ఈ హైదరాబాద్ విమాన సర్వీసుకు 100 మంది ప్రయాణికులు హైదరాబాద్‌కు వెళ్లడం విశేషం. అంటే ఇటు తిరుపతితో పాటూగా హైదరాబాద్‌కు కూడా కనెక్టవిటీ ఉంది. ఈ రాజమహేంద్రవరం-తిరుపతి విమానం వారంలో మూడు రోజులు.. ఉదయం 07:40 గంటలకు తిరుపతి నుంచి బయల్దేరుతుంది.. ఉదయం 9.25గంటలకు రాజమహేంద్రవరం చేరుకుంటుంది. అనంతరం 25 నిమిషాల తర్వాత తిరుగు ప్రయాణంలో రాజమహేంద్రవరంలో ఉదయం 9.50గంటలకు బయల్దేరుతుంది.. 11.20గంటలకు తిరుపతికి చేరుకుంటుంది. ఈ కొత్త సర్వీసు ప్రధానంగా తిరుమల శ్రీవారిని దర్శించుకునే భక్తులకు ఎంతో ఉపయోగంగా ఉంది. రాజమహేంద్రవరం నుంచి కేవలం గంటన్నరలోనే తిరుపతికి వెళ్లడంతో ప్రయాణికులు ఈ విమానంలో టికెట్లు బుక్ చేసుకుంటున్నారు. రాజమహేంద్రవరం టు తిరుపతి విమాన సర్వీస్ మాత్రమే కాదు.. ఏపీ నుంచి విదేశాలకు, పలు నగరాలకు కొత్త విమాన సర్వీసులు ప్రారంభమైన సంగతి తెలిసిందే. త్వరలోనే మరికొన్ని సర్వీసులు ప్రారంభించాలని చూస్తున్నారు.

చంద్రగిరి మండల పరిధిలో డ్రోన్ నిఘా

ప్రజాశక్తి - చంద్రగిరి: చంద్రగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో నేరాల నియంత్రణకు పోలీసు యంత్రాంగం పకడ్బందీ చర్యలు చేపట్టింది. శివారు ప్రాంతాల్లో చట్ట వ్యతిరేక, అసాంఘిక కార్యకలాపాలు, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం వంటి వాటికి అడ్డుకట్ట వేసేందుకు డ్రోన్ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేస్తున్నట్లు సీఐ సురేష్ కుమార్ తెలిపారు. చంద్రగిరి మండలంలోని గ్రామాలు, పట్టణ శివారు, అటవీ ప్రాంతాల్లో నేరాలకు పాల్పడే వారిని డ్రోన్ సహాయంతో గుర్తిస్తామన్నారు. పోలీసులు ఘటనా స్థలాలకు వెళ్లకుండా తాము ఉన్నచోటు నుంచే డ్రోన్ పసిగడుతుందన్నారు. డ్రోన్ కెమెరాలను ఉపయోగించి శివారు ప్రాంతాల్లో పేకాట ఆడుతున్న, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న వారి అసంఘిక కార్యకలాపాలు డ్రోన్ కెమెరాలో రికార్డు అవుతుందని, తద్వారా వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రవీంద్రనాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

పొడవైన మహిళతో భక్తుల సెల్ఫీ



ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో: ఏడు అడుగుల ఎత్తు ఉన్న శ్రీలంక నెట్ వాలీబాల్ క్రీడాకారిణి తర్జనీ శివలింగం తిరుమలలో శ్రీవారిని దర్శించుకున్నారు. అత్యంత 'పొడగరి'గా ఉన్న ఆ క్రీడాకారిణితో భక్తులు సెల్ఫీలు తీసుకోడానికి ఆసక్తి చూపడం గమనార్హం. వాహనమలై పీఠాధిపతి రామానుజ జీయర్‌స్వామితో కలిసి ఆమె శ్రీవారిని దర్శించుకున్నారు. వారితో పాటు ఈ పొడవైన మహిళ కాంప్లెక్స్‌లోనూ, క్యూలైన్‌లోనూ, గర్భగుడిలోనూ సందడి చేశారు.

క్రైం న్యూస్

ట్రాక్టర్ కిందపడి కూలీ మృతి



మృతి చెందిన వెంకట రమణయ్య

ప్రజాశక్తి - గూడూరుటౌన్ : ట్రాక్టర్ కింద పడి కూలి మృతి చెందిన ఘటన గూడూరు రూరల్ పరిధిలోని కందలి బి చేమిర్తి గ్రామ సమీపంలో చోటుచేసు కుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివ రాల మేరకు.. మండలంలోని కందలి గ్రామానికి చెందిన వెంకట రమణయ్య(52) అనే వ్యక్తి కూలీపనులు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. ఈక్రమంలో సోమవారం ట్రాక్టర్లో మట్టి పనులకు వెళుతుండగా ప్రమాదవశాత్తు ట్రాక్టర్ కుదుపులకు డ్రైవర్ పక్కనే కూర్చొనివున్న వెంకటరమణయ్య ట్రాక్టర్ టైర్ కిందపడడంతో మృతిచెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆసుపత్రి తరలించి, రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మృతిపై పలు ఆరోపణలు..

వెంకటరమణయ్య మృతిపై పలు ఆరోపణలు వినవస్తున్నాయి. గ్రామంలో అక్రమంగా మైనింగ్ నిర్వహణ చేపడుతుండగా క్వార్జ్ లారీలో లోడింగ్ చేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు క్వార్జ్ రాయి బస్తాలపైన పడి వెంకటరమణయ్య తీవ్రగాయాలపాలై మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. అయితే పోస్టుమార్టం నివేదికలో, పోలీసుల దర్యాప్తులో అసలు నిజాలు వెలుగులోకి రావాల్సివుంది.

లారీ, బైకు ఢీ.. తండ్రీ కొడుకులు మృతి


మృతి చెందిన ఉలస సుబ్రహ్మణ్యం, రూపేష్

ప్రజాశక్తి - నాయుడుపేట: బైకు, లారీ ఢీకొన్న ప్రమాదంలో తండ్రి, కొడుకులు మృతి చెందిన ఘటన పెళ్లకూరు మండలం, గుర్రపు తోట సమీపంలో సోమవారం ఉదయం చోటు చేసుకుంది. ఉలస సుబ్రహ్మణ్యం (అలియాస్ టోనీ) (33) రోజువారి కూలీగా సెంట్రింగ్ పనులకు వెళుతూ జీవనం సాగిస్తున్నాడు. ఇతను తెట్టు, నక్క హరిజన వాడ ప్రాంతంలో నివాసం ఉంటున్నాడు. సోమవారం ఉదయం తన కుమారుడు రూపేష్ (7) తో కలిసి నాయుడుపేటలోని తన బంధువుల ఇంటి నుండి బైక్‌పై తిరిగి వెళుతుండగా, నాయుడుపేట-పూతలపట్టు 71వ జాతీయ రహదారి పెళ్లకూరు మండలం, గుర్రపు తోట వద్ద వారి బైక్‌ను లారీ ఢీకొంది. దీంతో సుబ్రహ్మణ్యం అక్కడికక్కడే మృతి చెందగా, బాలుడు తీవ్ర గాయాల పాలయ్యాడు. చుట్టుపక్కల వారు పోలీసులకి, అంబులెన్స్‌కి సమాచారం అందించగా గాయపడిన బాలుడ్ని అంబులెన్స్‌లో నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం శ్రీకాళహస్తికి తరలిస్తుండగా బాలుడు మార్గమధ్యంలో మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పెళ్ళకూరు ఎస్సై నాగరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలియజేశారు.

మేయర్ ఆధ్వర్యంలో సంబరాలు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: భారత మహిళల తొలి ప్రపంచ కప్ ఫైనల్ దక్షిణాఫ్రికాపై అద్భుతమైన విజయం సాధించి, చరిత్ర సృష్టించిన భారత మహిళా క్రికెట్ జట్టుకు తిరుపతి మేయర్ డాక్టర్ శిరీష ఆధ్వర్యంలో కార్పొరేటర్లు వైసిపి మహిళ నాయకురాలు శుభాకాంక్షలు తెలియజేసి, కేక్ కటింగ్ చేసి సంబరాలు నిర్వహించారు. తిరుపతి, పద్మావతి పురం పార్టీ కార్యాలయంలో సోమవారం మేయర్ పార్టీ నగర మహిళా విభాగం అధ్యక్షురాలు కోటేశ్వరమ్మల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. మేయర్ మాట్లాడుతూ ఈ విజయం పరంపర కొనసాగాలని కోరుకొంటూ కెప్టెన్ హర్మాన్ ప్రీత్ కౌర్ కు, మిగతా జట్టు సభ్యులకు అభినందనలు తెలిపారు. ఈ వేడుకల్లో ఆరణి సంధ్య, ఆదిలక్ష్మి, వైసీపీ రాష్ట్ర, జిల్లా కార్యవర్గ మహిళలు, నగర మహిళా విభాగం నాయకురాలు, మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.

మంత్రి సవితమ్మకు సత్కారం

ప్రజాశక్తి - తిరుపతి (మంగళం): రాష్ట్ర టెక్స్టైల్స్, జౌళి శాఖ మంత్రి సవితమ్మను సౌత్ ఇండియా ఓబిసి రాష్ట్ర అధ్యక్షులు జబ్బుల శ్రీనివాసులు సోమవారం మంత్రి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఇటీవల జరిగిన ఓబీసీ సెమినార్ విషయాలను మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా జబ్బుల శ్రీనివాసులు తలపెట్టిన కార్యక్రమాలను తెలుసుకొని మంత్రి సవితమ్మ ప్రత్యేకంగా అభినందించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో గాయత్రి గ్రూప్ సీఈవో జబ్బుల శ్రీసాయి, అప్పారావు యాదవ్, చైతన్య, కృష్ణ, బీసీ నాయకులు పాల్గొన్నారు.

నారాయణలో స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : స్థానిక నారాయణ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో సోమవారం స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తరగతి గదిలో తాము నేర్చుకున్న అంశాలను తల్లిదండ్రుల ఎదుట ప్రదర్శించారు. ఈ-కిడ్జ్ కార్యక్రమంలో భాగంగా ఈ ప్రదర్శన జరపగా, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. ప్రిన్సిపాల్ ఈశ్వరయ్య పాల్గొన్నారు.

గృహప్రవేశం కార్యక్రమంలో టీడీపీ నాయకులు

ప్రజాశక్తి - శ్రీకాళహస్తి రూరల్(తొట్టంబేడు): టీడీపీ మాజీ మండల అధ్యక్షుడు గాలి మురళి నాయుడు సోమవారం కే.వీ.బి పురం మండలం టీడీపీ మండల అధ్యక్షులు, తొట్టంబేడు మండలం మాజీ మార్కెటింగ్ కమిటీ అధ్యక్షులు బీసా బత్తిన రామానుజుల నాయుడు గృహప్రవేశ కార్యక్రమానికి హాజరయ్యారు. మొదటగా రామానుజల నాయుడుని సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్వగ్రామంలోనే నివాసాన్ని ఏర్పాటు చేసుకొని పేద ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెటింగ్ కమిటీ చైర్మన్ విజయ్ కుమార్ నాయుడు, రైతు విభాగం అధ్యక్షులు గోపీనాథ్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి శ్రీహరి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బాలగున్నయ్య మృతికి నివాళి

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని కాంపాళ్యం హరిజన వాడకు చెందిన వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకుడు బాలగున్నయ్య అనారోగ్యంతో ఆదివారం రాత్రి కన్నుమూశారు. విషయం తెలుసుకున్న బుచ్చినాయుడు కండ్రిగ వైసిపి మండల కన్వీనియల్ మణి నాయుడు, వైసిపి నాయకులు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్సీపి జిల్లా ప్రధాన కార్యదర్శి గురునాథం జై చంద్ర నాయుడు, మాజీ సర్పంచ్ గురవయ్య, దేవదాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఐఓసీఎల్ ప్లాంట్ నిర్మాణం పూర్తి చేయండి

పలు విభాగాలపై టిటిడి అదనపు ఈవో సమీక్ష

ప్రజాశక్తి - తిరుమల: తిరుమలలోని పద్మావతి విశ్రాంత గృహంలోని సమావేశ మందిరంలో సోమవారం టీటీడీ అదనపు ఈవో సి.హెచ్. వెంకయ్య చౌదరి పలు అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుమలలోని వెంకటాద్రి నిలయంలో యాత్రికులకు వేడి నీటి సరఫరా కోసం సోలార్ ప్యానెల్ ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలిస్తూ అవసరమైన సౌకర్యాలను వెంటనే ఏర్పాటు చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ప్రవేశ ద్వారం వద్ద యాత్రికులు పాద రక్షలను ఎక్కడ పడితే అక్కడ వదిలేస్తున్నారని, ప్రవేశానికి ముందు వెళ్లే మార్గంలోనే స్టెయిన్‌లెస్ స్టీల్ పాద రక్షల ర్యాక్‌లు ఏర్పాటు చేసి, ప్రతి యాత్రికుడు ఆ మార్గం గుండా వెళ్లేటట్లు చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే వెంకటాద్రి నిలయంలోనికి పాద రక్షలతో రాకూడదని, లోపల పరిశుభ్రత పాటించాలని యాత్రికులకు పబ్లిక్ అడ్రెస్ సిస్టమ్ ద్వారా నిరంతర సూచనలు ఇవ్వాలని ఆదేశించారు. పిఎసి-5లోని లాకర్ల, హాల్స్, కళ్యాణ కట్ట, మెడికల్ సౌకర్యాలు, అన్నప్రసాద వివరాలను రిసెప్షన్ విభాగం సమన్వయం చేసి డైనమిక్ ఇన్ఫర్మేషన్ రూపంలో పబ్లిక్ అడ్రెస్ సిస్టమ్ ద్వారా ప్రకటించాల్సిందిగా ఆదేశించారు. యాత్రికుల భద్రత కోసం విజిలెన్స్ విభాగం తగిన సిబ్బందిని నియమించి, సీసీ కెమెరాలను అన్ని కీలక పాయింట్లలో అమర్చాలని సూచించారు. అనంతరం తిరుమల రెండో ఘాట్ రోడ్డుపై తాజాగా వేసిన బీటీ కోటింగ్ పనులపై అధికారులతో సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సైన్ బోర్డులు, రోడ్డుకు అడ్డంగా ఉన్న చెట్టు కొమ్మల తొలగింపు, అక్కగార్ల గుడి సమీపంలోని కొండల పైనుండి వర్షపు నీటి మళ్లింపుపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఘాట్ రోడ్లలో ముఖ్యమైన ప్రదేశాల్లో రోడ్డు భద్రతా నిబంధనలు, ఎన్‌హెఏఐ ప్రమాణాలకు అనుగుణంగా ఏకరీతిలో, అందంగా కనిపించేలా సైన్ బోర్డులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రోడ్ సేఫ్టీ గైడ్‌లైన్స్ ఉన్న సైన్ బోర్డులు స్పష్టంగా కనబడేలా అడ్డుగా ఉన్న కొమ్మలను వెంటనే తొలగించాలని ఫారెస్టు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అలిపిరి నుండి తిరుమలకు నడుచుకుంటూ వస్తున్న భక్తులు అక్కగార్ల గుడి సమీపంలోని డౌన్ ఘాట్ రోడ్డులో కొండల పైనుండి పడే నీటి వల్ల అసౌకర్యం ఎదుర్కొంటున్నారని అదనపు ఈవో తెలిపారు. ఆ నీరు రోడ్డుపై పడకుండా కల్వర్ట్‌లు ఏర్పాటు చేసి కాల్వల ద్వారా అడవి మార్గంలోకి మళ్లించే విధంగా ప్రణాళిక సిద్ధం చేయాలని చీఫ్ ఇంజినీర్ సత్య నారాయణను ఆదేశించారు.

తిరుమలలో ఘన వ్యర్థ నిర్వహణపై సమీక్ష

తిరుమలలో ఘన వ్యర్థాల నిర్వహణపై సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఐఓసీఎల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్ కార్యకలాపాలను ప్రారంభించే విషయంపై అదనపు ఈవో అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుమలలో ఉత్పత్తి అయ్యే ఘన వ్యర్థాలను ఉపయోగించి బయోగ్యాస్ ఉత్పత్తి చేసే ఐఓసిఎల్ ప్లాంట్ పనులను వీలైనంత త్వరగా పూర్తి చేసి కార్యకలాపాలు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

సుబ్బమ్మ మృతికి నివాళి

ప్రజాశక్తి-ఏర్పేడు: టిడిపి నాయకులు ఊటి చంద్రశేఖర్ మాతృమూర్తి, ఊటి సుబ్బమ్మ మృతి చెందడంతో ఏర్పేడు మండలం, బాలకృష్ణాపురం స్వగ్రహములో మృతురాలికి మండల అధ్యక్షుడు పేరం నాగరాజు నాయుడు నివాళులర్పించి, వారి కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో గుణాయాదవ్, రాచేటి సుబ్రహ్మణ్యం, నరసింహులు నాయుడు, వై మనోహర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యాన్ని కాపాడండి



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: భారీ వర్షాలతో పట్టణంలో పలుచోట్ల పారిశుద్ధ్యం దెబ్బతినిందనీ, వెంటనే మెరుగుకు చర్యలు చేపట్టాలని జనసేన నాయకులు సోమవారం మున్సిపల్ కమిషనర్ భవాని ప్రసాద్‌కు విన్నవించారు. దోమలు పెరిగి వ్యాధులు ప్రబలుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలో కుక్కలు, పందుల బెడద కూడా అధికంగా ఉందనీ, నివారణ చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో కుమార్, జయప్రకాష్, మాధవ మహేష్, దినేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రోహిత్ దంపతులకు సాదర స్వాగతం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : సినీ నటుడు నారా రోహిత్, శిరీష దంపతులకు టిడిపి సీనియర్ నేత కన్నలి ప్రతాప్ రెడ్డి స్థానిక శ్రీకాళహస్తీశ్వరాలయంలో సోమవారం సాదర స్వాగతం పలికారు. స్వామి అమ్మవార్ల దర్శన ఏర్పాట్లు చేశారు. ముక్కంటి తీర్థ ప్రసాదాలు, జ్ఞాపికలు అందజేశారు.

భూ సమస్యలు పరిష్కరించుకోండి



ప్రజాశక్తి - రామచంద్రపురం: భూ రీ సర్వేను రైతులు సద్వినియోగం చేసుకొని భూ సమస్యలను పరిష్కరించుకోవాలని తహశీల్దార్ మధుసూదన్ రావు సూచించారు. సోమవారం మండలంలోని కే కే వి పురం, కమ్మపల్లి గ్రామాలలో నిర్వహించే భూ సర్వేను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ముందుగా నోటీసులు ఇచ్చి నిష్పక్షపాతంగా సర్వే నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు. ఎక్కడైనా ప్రభుత్వ భూములు ఆక్రమణ గురై ఉంటే సంబంధిత ఆక్రమణదారులకు నోటీసులు ఇచ్చి ప్రభుత్వ భూమి నుండి ఖాళీ చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో భూ సర్వే డిప్యూటీ తహశీల్దార్ అమృత, వీఆర్వోలు ప్రదీప్ నాయుడు, నరసింహులు, రైతులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు, దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి - రేణిగుంట: రేణిగుంట మండలం, గురవరాజు పల్లి గిరిజన కాలనీవాసులకు అమెజాన్, డొనేట్కార్ట్ సంస్థల సౌజన్యంతో, ఆషా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు జూలియన్ రాజు ఆధ్వర్యంలో నిత్యావసరాలు, దుప్పట్లు సోమవారం డీఎస్పీ శ్రీనివాసరావు చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆషా సంస్థ ముఖ్య సలహాదారులు అమ్ములు రాజు, వార్డు మెంబర్ సుబ్బమ్మ, నాగమ్మ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించిన ఎమ్మెల్యే పాశిం

ప్రజాశక్తి -కోట : కోట పట్టణంలోని శ్రీ లక్ష్మమ్మ గిరిజన కాలనీలో 3 లక్షల రూపాయలతో నిర్మించిన ఫిష్ మార్కెట్‌ను ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ సమక్షంలో ఎన్ డి సీ సీ బి ప్రెసిడెంట్, పి ఏ సీ ఎస్ అధ్యక్షులు నల్లపరెడ్డి జగన్మోహన్ రెడ్డి ప్రారంభించారు. పొదుపు లక్ష్మి పరస్పర సహాయక సహకార పొదుపు సంఘం సొసైటీ బ్యాంక్‌ను ఎమ్మెల్యే సమక్షంలో నల్లపరెడ్డి జగన్మోహన్ రెడ్డి, తూర్పు కనుపూరు ముత్యాలమ్మ తల్లి ఆలయ చైర్మన్ చిల్లకూరు దశరథ రామి రెడ్డి ప్రారంభించారు. కోట పట్టణం శ్యామ సుందర పురంలో 60 లక్షల రూపాయలతో నిర్మించిన స్వర్గధామం (హిందూ స్మశానా వాటిక) ను తిరుపతి పార్లమెంట్ మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్.జలీల్ అహ్మద్, మాజీ ఎంపిపి నల్లపరెడ్డి. వినోద్ కుమార్ రెడ్డి, తెలుగుదేశం పార్టీ మాజీ అధ్యక్షులు మద్దాలి. సర్వోత్తమ్ రెడ్డి, తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పలగాటి.భాస్కర్ రెడ్డి, వాకాడు ఏఎమ్ సీ చైర్మన్ మర్రి ప్రమీల చేతులు మీదుగా ప్రారంభించారు. ముస్లిం స్మశాన వాటిక ఏర్పాటు చేయాలని షేక్ జలీల్ అహ్మద్ ఎమ్మెల్యేను అడగగా తప్పకుండా చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కోట హరిజనవాడలో కూడా స్మశాన వాటికను ఎమ్మెల్యేను వాకాడు ఏఎమ్‌సీ చైర్మన్ మర్రి.ప్రమీల అడగగా ఎమ్మెల్యే స్పందించి తప్పకుండా చేస్తానని తెలిపారు. అనంతరం మొంతా తుఫాన్ నేపథ్యంలో విధులు పట్ల అంకితభావంతో పనిచేసినందుకు ఉండవల్లి సీఎం క్యాంప్ ఆఫీసులో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా. చంద్రబాబు నాయుడు చేతుల మీదగా కోట తహశీల్దార్ కటారి. జయ జయ రావు అవార్డును అందుకున్న సందర్భంగా ఆయనను ఎమ్మెల్యే, కోట మండలం టీడీపీ నాయకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో పిఏ సీఎస్ అధ్యక్షులు నల్లపురెడ్డి.జగన్మోహన్ రెడ్డి,తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పలగాటి భాస్కర్ రెడ్డి,తిరుపతి పార్లమెంట్ మైనార్టీ అధ్యక్షులు షేక్. జలీల్ అహ్మద్,మాజీ ఎంపిపి నల్లపరెడ్డి. వినోద్ కుమార్ రెడ్డి,తెలుగుదేశం పార్టీ మాజీ అధ్యక్షులు మద్దాలి.సర్వోత్తమ్ రెడ్డి,కనుపూరు ముత్యాలమ్మ తల్లి ఆలయ చైర్మన్ చిల్లకూరు.దశరథ రామ్ రెడ్డి,వెంకన్న పాలెం సర్పంచ్ కొకర్ల.మధు యాదవ్,రైతు విభాగ కార్యనిర్వ కార్యదర్శి నెల్లూరు. మోహన్ రెడ్డి,ఏ ఎమ్ సీ చైర్మన్ మర్రి.ప్రమీల,ఎంపీటీసీ సభ్యులు దారా.సురేష్, శంషుద్దీన్,తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మారంరెడ్డి.శ్రీధర్ రెడ్డి,తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ తిరుమల శెట్టి.కోటేశ్వరరావు,ఏ ఎమ్ సీ డైరెక్టర్ సిద్దపరెడ్డి.పోలమ్మ, వాకా.విజయభాస్కర్ రెడ్డి,బందెల రఘురామ్,పల్లెమల్లు వెంకటకృష్ణా రెడ్డి, తల్లం. శ్రీనివాసులు, సుహాసిని, చిట్టి,నంద మోహన్, నీలు, ఎస్సీ సెల్ అధ్యక్షులు తిరుమూరు మురళి, అనూక్,వేణు,గురునాథం, తెలుగుదేశం పార్టీ సోషల్ మీడియా కో కన్వీనర్ మీజూరు మధు బాబు, నీలేష్ మండల అధికారులు,తదిరులు పాల్గొన్నారు.

శెట్టిపల్లి లే అవుట్ డెవలప్మెంట్ పనులకు సర్వం సిద్ధం



ప్రజాశక్తి - తిరుపతి డెస్క్: శెట్టిపల్లి లే అవుట్ డెవలప్మెంట్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్, తుడా చైర్మన్ దివాకర్ రెడ్డి, సంబంధిత అధికారులతో సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టరేట్, మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో ప్లానింగ్ అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించి దిశా నిర్దేశం చేసారు. తుడా చైర్మన్ మాట్లాడుతూ "శెట్టిపల్లి భూముల సమస్యకు శాశ్వత పరిష్కారం దొరకడంతో లే అవుట్ డెవలప్మెంట్ పనులకు సర్వం సిద్ధమని, అర్హులైన వ్యవసాయదారులకు, ప్లాటుదారులకు ప్లాట్లు కేటాయించపడతాయన్నారు. త్వరలోనే లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేస్తామని తెలిపారు. కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్ మాట్లాడుతూ శెట్టిపల్లిలో ఆధునిక మౌలిక సదుపాయాలతో కూడిన లేఔట్ నిర్మాణం జరుగుతుందని, అందులో రోడ్లు, డ్రైనేజ్, తాగు నీటి పైపులు, విద్యుత్, పార్కులు వంటి సదుపాయాలు సమగ్రంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. లే అవుట్ డెవలప్మెంట్ పనులను సంబందిత అన్ని శాఖల అధికారులు సమన్వయం చేసుకొని త్వరితగతిన పూర్తి చేయాలని తుడా, రెవెన్యు అధికారులను ఆదేశించారు.

జగనన్న కాలనీ సమస్యలు పరిష్కరించండి

ప్రజాశక్తి - రేణిగుంట: మండలంలోని జీ పాలెం పంచాయితీ కుర్ర కాలువ పద్మా నగర్ జగనన్న కాలనీ సమస్యలు వెంటనే పరిష్కరించాలని రేణిగుంట సిపిఐ మండల కార్యదర్శి వైఎస్ మనీ నాయకత్వంలో సోమవారం అధికారులను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పద్మా నగర్ జగనన్న కాలనీ కుర్రకాల్వ కాలనీలలో గత కొన్నేళ్లుగా ఎదుర్కొంటున్న సమస్యలు ఈ మధ్య కురిసిన వర్షాలకు కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులకు గురవుతూ అనారోగ్యాలకు గురవుతున్నారు కాబట్టి రాబోవు మూడు నెలల వర్షం ప్రభావం ఎక్కువగా ఉన్నందున వర్షాలని దృష్టిలో పెట్టుకుని అధికారులు వాళ్లకి మౌలిక సదుపాయాలు కల్పించాలని రేణిగుంట సిపిఐ పార్టీ ఏఐటియుసి ఆధ్వర్యంలో ఎంపీడీవో కి వినతి పత్రం ఇచ్చారు. ఎంపీడీవో వినతి పత్రం సమర్పించారు సానుకూలంగా స్పందిచి న ఎంపీడీవో ఆయన సందర్శించి సమస్యలు పరిష్కరించే దిశగా ప్రయత్నం చేస్తానని హామీ ఇచారు . కార్యక్రమంలో రేణిగుంట మండల పార్టీ సెక్రెటరీ వైఎస్ మణి ఏ ఐ టి యు సి మండల సెక్రెటరీ వి కార్తీక్ సెల్వ అమ్ములు శివగామి మనీ నవీన్ కృతజ్ఞతలు పాల్గొన్నారు

టెండర్ల రద్దు కోరడం దారుణం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పుత్తూరు మున్సిపాలిటీ అభివృద్ధికి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ చొరవతో రెండు కోట్ల రూపాయలు నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో 27 వార్డులకు సమానంగా అభివృద్ధి పనులు కేటాయించారు. కానీ పనుల కేటాయింపు సరిగా జరగలేదని వైసీపీ నాయకులు ఆరోపిస్తూ పుత్తూరు అభివృద్ధికి మోకాలు అడ్డం పెట్టడం సమంజసం కాదని గాలి జీవరత్నం నాయుడు హితవు పలికారు. సమావేశంలో టెండర్లు రద్దు చేయాలని కోరేలా చేయడం వెనుక మాజీ మంత్రి రోజా ఉన్నారని బీసీ కార్పొరేషన్ అధ్యక్షులు షణ్ముగం రెడ్డి ఆరోపించారు. వైసిపి కౌన్సిలర్లు చేస్తున్న నానా హడావిడిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి ఎన్ఎన్ ధనపాల్, మార్కెట్ కమిటీ చైర్మన్, డిఎస్ గణేష్, రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ గంజి మాధవయ్య, కౌన్సిలర్ కేశవ ఆచారి, తణుకు సింగల్ విండో చైర్మన్ కరుణ యాదవ్ తదితర నాయకులు పాల్గొన్నారు.

మద్యం షాపులకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి జిల్లా, సూళ్లూరుపేట ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో సూళ్లూరుపేట మున్సిపాలిటీ, దొరవారి సత్రం ప్రాంతంలో కేటాయించబడ్డ రెండు ఓపెన్ షాపులకు లైసెన్సు ఫీజు గడువులోపు చెల్లించలేకపోవడంతో వీటిని రద్దు చేయడం జరిగిందని జిల్లా మద్య నిషేధ, అప్కారి అధికారి కె.నాగమల్లేశ్వర రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నిబంధనల ప్రకారం సదరు రెండు షాపులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని, ఔత్సాహికులు ఈనెల 10వ తేదీన సాయంత్రం ఐదు గంటల లోపు తమ దరఖాస్తు సమర్పణకు చివరి గడువుగా నిర్ణయించడం జరిగిందన్నారు. పదవ తేదీ దరఖాస్తులను పరిశీలించి, 12వ తేదీన ఉదయం 8 గంటలకు జిల్లా కలెక్టర్ వారిచే లాటరీ డ్రా ద్వారా సదరు రెండు షాపులను కేటాయిస్తామన్నారు. సూళ్లూరుపేట మున్సిపాలిటీ పరిధిలో 2025-26 12-11-2025 నుండి 30-09-2026 వరకు రిటైల్ ఎక్సైజ్ టాక్స్ రూ.65,54,167, దొరవారి సత్రం మండలంలోని ఓపెన్ మద్యం షాపుకు 2025-26 12-11-2025 నుండి 30-09-2026 వరకు రిటైల్ ఎక్సైజ్ టాక్స్ రూ.55, 45, 834 రూపాయలను చెల్లించవలసి ఉంటుందన్నారు. దరఖాస్తు రుసుముగా రూ.2 లక్షలు చెల్లించాలన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే జరిమానాలే

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి మీదుగా వివిధ ప్రాంతాలకు బస్సు సర్వీసులను నడిపే కాంట్రాక్టు క్యారేజీ బస్సు డ్రైవర్లు నిర్లక్ష్యం వహించినా, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినా.. భారీ జరిమానాలు తప్పవని జిల్లా రవాణా శాఖ అధికారి కొర్రపాటి మురళీమోహన్ బస్సు ఆపరేటర్లను హెచ్చరించారు. సోమవారం తిరుపతి ఆర్టీఓ కార్యాలయంలో బస్సు ఆపరేటర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంట్రాక్టు క్యారేజీ బస్సుల యజమానులు, నిర్వాహకులు, మేనేజర్లు తప్పనిసరిగా ప్రయాణికుల సురక్షిత ప్రయాణానికి సంబంధించి తగు జాగ్రత్తలను తీసుకోవాలని సూచించారు. ఎటువంటి నిబంధనలు ఉల్లంఘించినా చర్యలు తప్పమన్నారు. ఈ సమావేశంలో మోటార్ వాహనాల తనిఖీ అధికారి వనం వెంకట సుబ్రహ్మణ్యం, మోహన్ కుమార్, ఆంజనేయ ప్రసాద్, అతికా నాజ్ , పరిపాలన అధికారి విజయకుమార్, యువ కిషోర్, ప్రైవేట్ ట్రావెల్స్ ఆపరేటర్ల సంఘ అధ్యక్షుడు రూపేష్ కుమార్, సెక్రెటరీ ఖాదర్ బాషా పాల్గొన్నారు.

ఎన్‌సిసి క్యాడెట్స్ ఎంపిక



ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీపద్మావతి మహిళ డిగ్రీ పీజీ కళాశాలలో 2025-2026 వ సంవత్సరానికి సంబంధించి ఆంధ్ర గర్ల్స్ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ అనూజ్ వాద్వా ఆధ్వర్యంలో డిగ్రీ మొదటి సంవత్సరం విద్యార్థినులకు ఎన్ సిసి క్యాడెట్ ఎంపిక ప్రక్రియ సోమవారం నిర్వహించారు. 300 మంది విద్యార్థినిలు పాల్గొనగా 63 మందిని ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సిహెచ్ సుహాసిని, టి.హేమలత, 5 ఆంధ్ర గర్ల్స్ పిఐ సిబ్బంది, విద్యార్థినిలు పాల్గొన్నారు.